● జయధీర్-తిరుమలరావ్



# కన్య

"ఒంటరిగా కూర్చోబెట్టి నువ్వు ఆలోచిస్తూ బోర్‌కొట్టించేస్తున్నావ్." చిరుకోపంగా అంది ఉమ.

ఆలోచిస్తున్న నీలకాంత్ లేచి రేడియో ట్యూన్ చేయసాగాడు. సిలోన్ నుండి తన కిష్టమైన ముఖేశ్ గంభీరస్వరం వినవస్తూంటే అలాగే ఉంచాడు.

"మేరా ప్రేమ్ హిమాలయ్‌సే ఊంఛా సాగ

ర్ పే గెహరా ప్యార్ మెరా
అపనా కహెదో..."

హృదయాల్ని కరిగించే పాటవస్తుంది.

"ఛీ ! అదేం పిచ్చి పాట, చక్కగా తెలుగు స్టేషన్ పెట్టు". ముఝే ఎక్ బార్

"అందుకో ఎంత అర్థముందో నీకేం తెలుసు-తెలిస్తే ప్రాణాలు విడుస్తావ్",

"అవునవును..." అంటూంటే ఆమె ముఖంలో కళ తప్పింది. పాట స్థాయినందు కుంది. నీలకాంత్ హృదయంలో సంతోషపు గుబగుబలు ఆరంభమయ్యాయి.

బయట చల్లని గాలులువీస్తున్నాయి-

కిటికీలన్నీ మూసిపెట్టినా చల్లగానే ఉంది.

"అతిథికి కాఫీ అయినా ఇవ్వడంలేదు" కడుపులో ఆకలవుతుంటే అంది ఉమ.

"సారీ ! ఇంట్లోపాల్లేవు. నేను హోటల్లోనే త్రాగుతున్నా-ఫ్లాస్క్ తీసుకెళ్లి తెస్తానుండు అలాగే కారియర్ ఇంటికి తెమ్మని చెప్తాను" అంటూ బయటికి వెళ్ళాడు.

ఆమె ఒంటరిగా కూర్చుని ఆలోచించ సాగింది. బుక్ షెల్ఫ్‌లో ఎన్నో పుస్తకా లున్నాయి, టేబిల్‌పై పేపర్లు రెపరెపలాడు తున్నా వాటిని చూడబుద్ధికాక అప్రయత్నంగా డ్రాయర్ తీసింది. అందులో రెండు మూడు ఉత్తరాలు కనిపించాయి. ఒకటి పరిచయమున్న దస్తూరిలా కనిపిస్తే తీసి చూసింది - సరళ రాసింది. నీలకాంత్‌కు,

ఉమ ఆశ్చర్యంతో తెరచిఉంచిన లెటర్ విప్పబోయి సంకోచించింది. సగం విప్ప బోయిన ఇన్‌లాండ్ లెటర్ నొంచి అక్షరాలు కనిపించేసరికి సభ్యత అడ్డొచ్చినా ఆగలేక పోయి విప్పింది.

నీలకాంత్‌కు,

నీవు రాసిన ఉత్తరం చదివిభయపడ్డాను. బాధపడ్డాను కూడ. జీవితం గూర్చి నువ్వు-అంటే నీలాంటి ఒక సంసారిచేసిన వేదాంత పూరిత వ్యాఖ్యానాన్ని నేను హర్షించలేను. జీవితాన్ని సఫలమూ, ఆరోగ్యవంతమూ చేసి కొనడమే మనిషి లక్షణం. నువ్వు జీవితాన్ని లాటరీలా ఆడొద్దనేదే నాకోర్కె. మలుపులు తిరిగిన జీవితపు త్రోవని, నచ్చలేదని, ఇష్ట మొచ్చినట్లు త్రిప్పితే, అది మొగ్గను బలవం తంగా పూయించడమే అవుతుంది.


ఏ క్షణంలో నీవు నాకు స్నేహితుడి వయ్యావో అప్పటి నుండి నీలోని ఉన్నత భావాల్ని నేను గుర్తించాను. నిన్నే మార్గ దర్శిగా ఎన్నుకొని నా జీవితాన్ని మలుచుకుం టున్నాను. జీవితం అంటే ఏమిటో, నీ ఉత్త రాల ద్వార, ఉపదేశాల ద్వార తెల్సుకున్నాను. నన్ను జీవితపు నిజమైన విలువలు తెల్సుకో గల చైతన్యవంతురాలిగాచేసింది నువ్వే అలాంటి నీకు నేను ధైర్యాన్ని నూరిపోయ గలనా ?

నీ జీవితాన్నిలా చేసినవిధినీ-భగవంతుణ్ని కాదు-ఉమని నిందించాల్సింది...ఉమ చేసిన పనిని తల్చుకుంటే నిజంగా నాకిప్పటికీ కోపం వస్తూంటుంది. ఆమె, జీవితంలో ఎంతటి అమూల్యమైన దాన్ని గుడ్డిగా కాలదన్ను కున్నదో తప్పకుండా తెల్సుకుంటుంది. జరి గిందేదో జరిగిపోయింది. గతించినదానికి చింతించి లాభంలేదు.

అన్నట్లుమరిచా, మాలిని నాకు ఉత్తరం వ్రాసింది. అందులో ఎంత గాంభీర్యంఉందని! నిజంగా ఆమె ఏమాత్రం తొణకని నిండు కుండ అలాంటి భార్యదొరకడం నీ అదృష్టం క్రొత్తదనాన్ని తీర్చిదిద్దుకోవడంలో తోట మాలి ఎంత కష్టపడ్డాడు ? నీ జీవితాన్ని పుష్పింపజేసుకోవడంకోసం నువ్వూ అంత శ్రమించడం నీ ధర్మం. ఇంతకన్నా ఎక్కువ నీకేమీ చెప్పలేను.

సెలవు !

సరళ



ఆ ఉత్తరం మడిచి పొదుగులో పెట్టి ఆలో చించసాగింది..."సరళ కూడా తనపై కోపంగా ఉన్నది...ఎందుకు నేనేం పాపం చేశాను... చివరికి నువ్వు కూడా నన్ను సహ్యించుకొంటున్నావా సరళా?" ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి. 'నిజమే జీవితంలో తాను దేన్ని కాలదన్నుకున్నదో తనకిప్పుడర్థమైంది-నీలకాంత్ సమక్షంలో తన మనస్సెంతహాయిగా ఉంది'! ఆమెకు వెంటనే ప్రతాప్ నిర్లక్ష్యం గుర్తుకొచ్చి మనసులో అసహ్యం పేరుకొంది...

"పదిహేను రోజులు కేంప్ కెళుతున్నా, ఉంటే ఒంటరిగా ఉండు లేదా పుట్టింటికి వెళ్ళు" ప్రతాప్ మాటలు ఆమెలో ప్రతిధ్వనించాయి. 'తనంటే అతనికెంత నిర్లక్ష్యం...

"హూ" ఆమె మనసు బాధగా మూల్గింది.

టేబిల్ మీద ఉన్న నీలకాంత్ ఫోటోను చూస్తూ "ఒకప్పుడు నిన్నూ నీ ప్రేమనూ గుర్తించలేదు. అది పసితనంలో అనుకో, కాని ఇప్పుడు నా మనసును గుర్తించని అః వేకిగా తయారయ్యావు నువ్వు"

"ఏంటలా ఆలోచిస్తున్నావ్ ఒక్కదాన్నని భయపడ్డావేంటి" ఫ్లాస్క్ టేబిల్ పై పెడ్తూ అన్నాడు నీలకాంత్.

"నీలా నేను పిరికిదాన్ని కాదులే"

"నేను పిరికివాణ్నా?"

"కాకపోతే. స్నేహితురాల్ని బజార్లో కనిపిస్తే ఇంటికిరమ్మని అనలేనివాడివి ... ఏమైనా అంటే...ఒంటరిగాఉన్నాను. ఎలా రమ్మనను అంటావు! అంతపిరికి పనికిరాదు!" ఫ్లాస్క్ మూత తెరుస్తూ అంది ఉమ.

నీలకాంత్ ముఖం ఎర్రబడ్డది. ఉమ చేతుల్లోంచి ఫ్లాస్కు తీసుకొని కాఫీ కప్పుల్లోకి వంచాడు. కప్పుఅందిస్తూ ఆమె కళ్ళలోకిచూసాడు...ఆ కళ్ళు వెటకారంగా నవ్వుతున్నాయి.

"అబ్బ నోరుకాల్చింది" కప్పు క్రింద పెడ్తూ అంది ఉమ.

"ముందే చూసుకోవాలి. నోరుకాలింతర్వాత

తెల్సుకుంటే ఏం ప్రయోజనం"

ఆమె ఒక్క క్షణం స్తంభించి పోయింది. ఆ మాటను తరచి తరచి ఆలోచించింది. చీకట్లో సన్నగా వెలుగు ప్రసరించినట్లయింది. ఓమూల అంతరాత్మ దోషిలా తలవంచుకొంది.

"ఈ కాఫీ వేడిగా ఉందా" ఒక్క గుక్కలో త్రాగి అన్నాడు

ఆమె మాట్లాడలేదు

"కారియర్ వస్తుంది ముఖం కడుక్కో బాత్‌రూమ్‌లో నీళ్ళున్నాయి" అని వీక్లీ చేతిలోకి తీసుకున్నాడు "ఏం ఇప్పుడు బాగాలేనా?" విసురుగా అడిగింది.

ఒక్కక్షణం ఆమె ముఖంలోకి చూసి 'లేవు'

"బాగుంటేనేం లేకుంటేనేం - భోజనం చేసేందుకు."

"ఈ విసుగు ఎప్పటినుండి? చిన్నప్పుడు తలబిరుసేఉండేది" పత్రిక మూసేస్తూ అన్నాడు

"నిన్ను అప్పుడు చూస్తే అలా. ఇప్పుడు చూస్తే ఇలా ఉండబుద్ధవుతుంది."

నీలకాంత్‌కు ఏమనాలో తోచలేదు. నిశ్శబ్దంగా పత్రిక తిరగేయసాగాడు. ఆమె టవల్ అందుకొని బాత్‌రూమ్‌వైపు నడిచింది.

నీలకాంత్ మనసుని పత్రికలో లగ్నం చేయలేకపోయాడు. అంతర్గతంగా అతని హృదయం ఓ వైపు ఆనందడోలికలాడుతుంది. ఉరకలెత్తే ఊహల్లో యుగాలనిరీక్షణ ఈనాడు ఫలించిందని హోరులెత్తుతూంది. మరోవైపు ఇన్నేళ్ళు పవిత్రంగా ప్రేమించిన ప్రేమ, నిష్కారణంగా తిరస్కరింపబడిన ప్రేమ ఎదురు తిరుగుతూంది. ఏ ఒక్కనాడు తనతో మనసు విప్పి మాట్లాడక, తిరస్కారంలో నరకాన్ని చూపిన ఆమెపై కోపం, కసి


Grams : 'NARASIMHA'

Phone : 424

*With The Best Compliments of*

**Narasimha Nut Powder Co.,** (Regd)

**Head office :**

*Gandhinagar : ELURU*

...సుకుంటూ ఉంది.

తన ఉత్తరాల్ని నవ్వుతూ తిరస్కరించిన ...మెపై ద్వేషం నాటినుంచే పెరుగుతూ ...ంది. ఆ ఉమ ఇప్పుడు తన ఎదుట ...పరిహసిస్తోంది

"పత్రిక చదువుకోడానికి తరువాత తీరిక ...వా స్వామి! నాకు బోర్ కొట్టివ్వాలనేనా మీ ప్రయత్నం ?" ముఖం తుడుచుకుంటూ అంది

"ముఖం కడుక్కుంటున్నావని".

"తమరి ఆజ్ఞగా, కడుక్కోకుంటే కోపం వస్తుందని".

"నేను చెప్పినట్లల్లా చేస్తావా ?"

"నాకేం ఖర్మ, చెయ్యను" టవల్ ఆరేస్తూ అంది.

"సార్ !" బయటినించి కేక విన్పించింది. ...తలుపుతీసి క్యారియర్ అందుకున్నాడు. టేబిల్ పై క్యారియర్ విప్పిపెడుతూ "ఎన్నాళ్ళ తరువాత నీతో భోజనం" నవ్వుతూ అన్నాడు

"మా వాళ్ళు కితంకదూ! మనమందర పిక్నిక్ వెళ్ళింది" పౌడర్ అద్దుకుంటు అంది.

పిక్నిక్ పేరెత్తగానే నీలకాంత్ హృదయం మూగబోయింది...అదేనాడు తన హృదయాన్ని విప్పిచెప్పినచ్చజెప్పాలనుకున్నాడు, కాని ఉమ అది తెలుసుకొని అతనికా అవకాశం ఇవ్వకుండాఏడ్పించింది. ఆనాడు చెంప దెబ్బకొట్టాలన్నంత కోపంవచ్చిందతనికి.

పౌడరద్దిన చెంపను చూస్తు తనచేతిని తడుముకున్నాడు. 'ఇవ్వాళ ఉమనేడ్పించాలి...కసిదీరా ఏడ్పించాలి. ఇన్నాళ్ళ తన ద్వేషాన్ని పేకముక్కల్లా పర్చిచూపాలి' దృఢంగా అనుకున్నాడు.

"త్వరగాభోంచేసి స్టేషన్ కెళ్దాం ఇంకో ...ంపుగంటలే ఉంది"

"రేపు వెళ్దువుగాని" ఉమవైపు చూస్తూ అన్నాడు.

"ఆఁ" విస్మయంగా చూసింది.

"అవును, సినిమా చూసి రేపు వెళ్ళు" మామూలుగా అన్నాడు.

"లేదు, వెళ్ళాలి" ఖచ్చితంగా అంది.

"మళ్ళీ ఎప్పుడు కలుస్తావ్"

"కలువను" నిర్మొహమాటంగా అంది. దెబ్బ తిన్నట్లుగా చూసాడు నీలకాంత్.

ఉమ మనసులో బాధపడింది. అలాఎందుకున్నానా అని. 'అదే ప్రతాప్ తనతో ఇలా నిక్కచ్చిగా మాట్లాడితే తాను రోజల్లా కుమిలి కుమిలి ఏడుస్తుంది, ఎప్పుడైనా ఊరుకో లేక ఒక్కమాట ఎదురు చెప్తే దవడ వాయ కొడ్తాడు. కాని తన మాటలు వింటూంటే నీలకాంత్ కి ఏమి అన్పించడం లేదా ?"

"నామీద కోపంగా ఉందా ?" అనునయంగా అంది.

"నీమీద నాకెందు కుంటుంది. కోపం" నీరసంగాఅన్నాడు. ఉమ ప్రసన్నంగా, ముఖం త్రిప్పుకుంది.

"నే నెప్పుడైనా గుర్తొస్తానా ?"

"నీ వెందుకు గుర్తొస్తావు" ఆమె నవ్వుకుంది. అతని కళ్ళు ఎరుపెక్కాయి, పిడికిలి బిగుసుకుంది. ఉమ అద్దంలోంచి అతన్ని గమనిస్తూ గుండె లోపల నిశ్శబ్దంగా నవ్వుకుంది.

ఆమెకు తెలుసు ఏళ్ళుగా నీలకాంత్ మంచి తనం అందుకే అతన్నేడిపిస్తూంది.

"ఉమా !" కంచు ధ్వనిలో ప్రేమ కరిగించిన గొంతుతో అరిచాడు.

"కాంత్ !" గొణిగింది, పరవశించింది.

"ఉమా ! నేనంటే నీకున్న నిర్లక్ష్యానికి ప్రతీకారం తీర్చుకోందే నిన్నివ్వాళ వదలను" అకస్మాత్తుగా అన్నాడు.

గొంతులోని తీవ్రతకు, భయంగా అతని వైపు చూసింది- కాంత్ ఆలోచన ఏమిటో తెల్వడం లేదామెకు.

"ఇన్నేళ్ళు నిన్నారాధించి, ప్రేమించి, పిచ్చివాణ్నై ఒక చల్లని చూపుకై పరితపిస్తే నాకు ప్రతిఫలంగానువ్విచ్చింది ద్వేషాన్నిమాత్రమే. నాలో ఏ ద్వేషం నీ వల్ల రగుల్కుందో అదే నిన్ను కాల్చుతుందిప్పుడు- చూపులతో, చేతలతో, చివరికి మాటలతో కూడ ప్రాణాలు

తీసే నీ లాంటి రాక్షసిని నేనింక బ్రతక నివ్వను. నిన్ను చంపి నేను చస్తాను" ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తూఅన్నాడు.

"వద్దు, వద్దు......కాంత్ ! నన్ను చంపి నువ్వు హంతకుడివి కావొద్దు... మాలిన్ని అన్యాయం చెయ్యొద్దు. కావాలంటే నాకు నేనే చస్తాను......" వెక్కి వెక్కి ఏడుస్తూ అంది ఉమ.

"లేదు! నా చేతులార నేనే చంపాలి! అప్పుడే కసి తీరేది. అప్పుడే నా ప్రేమకు నిండుదనం. ఇది ఈ నాటి కోరికకాదు ఉమా! ఇన్నాళ్ళుగా నే నెదురు చూస్తున్న కోరిక"

ఆమెను సమీపించాడు... అతనిలోనూతన శక్తి ప్రసరించింది. భయంతో జారిపోయిన ఆమె వైపే చూస్తుండి పోయాడు.

ఉమ అదేం గమనించే స్థితిలో లేదు. మరణానికి కూడ సిద్ధపడి అతని వంకే చూస్తుండిపోయింది. ఇన్నాళ్ళు ప్రతాప్ కేర్ లెస్‌కు తాను ఎన్నోసార్లు చచ్చిపోవాలను కుంది. ఇప్పుడు తన ప్రియమైన నీలకాంత్ చేతుల్లో చావడం ఆమె భయాన్ని తగ్గించింది. పోగా ధైర్యాన్ని పెంచింది.

"నిన్ను చంపను. రోజు రోజు, ప్రతి క్షణం చావాలి. నిన్ను చిత్రవధ చేస్తాను" ఆమె వైపుకు రాసాగాడు.

ఆమె ముఖంలో మళ్ళీ భయం తాండవిం చింది. పెదాలు అదర సాగాయి. పిచ్చిగా కలలా ఉందామెకు.

మెడపై చేతులు వేసాడు. ఆమె తన శ్వాసను బిగపట్టుకుంది. ఎక్కడ పోతుం దోనని.

మెల్లగా చేతులు క్రిందకు జారాయి. నరాలు మేల్కొన్నాయి.

ఆమె తిరస్కారంగా కదిలింది. అతడి చేతుల్ని పట్టుకుంది. ప్రార్థనాభరితమైన చూపులతో.

క్షణికోద్రేకం ముందు అతని విచక్షణా జ్ఞానం ఓడి పోయింది- అతని ఆవేశంముందు ఎదురు తిరిగిన ఆమె శరీరం ఓడిపోయింది.

* * *

చిందర వందరగా ఉన్న గదిలో నీలకాంత్ వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. గది చీకటిగా ఉంది. బజార్లో లైట్లు వెలిగాయి. నలిగిపోయిన పూలు వాసన రంసుమారి నల్లగా కన్పించాయి క్యారియర్ విప్పిఉంది. ఎలా వేసిన విస్తర్లు అలాగే ప్రాణువుల్లా ఉండిపోయాయి. "ఆక లిగా ఉన్న ఉమకు ఆతిథ్యంగా నేనేమిచ్చాను? పశ్చాత్తాపం ద్వేషాని కన్నా వేయి రెట్లుపెరిగి అతన్ని కాలుస్తూంది. ఆ సెగలఆవిర్లే కన్నీటి బొట్లు! అతని ప్రేమ- అతని అణువణువు పైన ఎదురు తిరుగుతుంది...

అతని హృదయం 'ఉమాక్షమించు' అనే ప్రతిధ్వనులతో హోరు లెత్తుతూంది.

అద్దంలో అతని స్వరూపం పాపం ముద్దవలె భయంకరంగా కన్పించింది, చూడలేక కళ్ళు మూసుకున్నాడు. భౌతికంగా నీల కాంత్ చేతులు, కాళ్ళు; అవయ వాలు ఏమి లేవు ఒక్క మనస్సు తప్ప- ఆ మనస్సూ పశ్చాత్తా పంతో కుమిలి కుమిలి కాల్తూ కనిపించింది. ఇప్పుడతన్నిపై అతనికే ఎనలేని కసి !

గోడపైన తన పెళ్ళిపోటో కన్పించింది. 'మాలిని ఎంత క్షోభ పడుతుంది. తన వల్ల ! ఛ ! వ్యర్థుణ్ణి! అందరికి కంటకంగాఉన్నాను' అనుకున్నాడు.

గతించిన జీవితపు సారాంశంగుర్తొచ్చింది. 'ఏమీలేదు ప్రేమ-ద్వేషం ఈ రెండు అయ స్కాంతాల మధ్య ఘర్షణే జీవితం! కొన్నాళ్ళు ఒకదాని గెలుపు- మరికొన్నాళ్ళు మరో దాని గెలుపు... అప్పుడనిపించిందతనికి. ఎందుకు

పుట్టాను ? ఎలా పెరిగాను ఏం చేసాను? అసలు జీవితానికి పరమార్థం ఏంటని ఆలో చించాడు. అన్నిటికి సమాధానం ఏమి లేదనే తేలింది. 'ప్రయోజనం లేని జీవితం' గొణు కున్నాడు......

* * *

"ఆగూటే అనకు ప్రతాప్" బాధగా అంది సరళ.

"కోపమా" సూటిగా చూసు అన్నాడు.

"కోపమెందుకు ప్రతాప్" యోగినిలా నవ్వింది.

"రెండో పెళ్ళని బాధా ! మీ అమ్మా నాన్నలను ఒప్పించాను, కట్నం, కానుకలు ఏమీ వద్దు, నువ్వుచాలు సరళా !" ఆశగా అన్నాడు.

సరళ బాధగా నవ్వింది, కోపాన్ని దిగ మ్రింగుతూ "కట్నం! కట్నం కోసం ఉమను పెళ్ళిచేసుకొని నన్ను నా ప్రేమను కాలద న్నావు. ఉమనుండి కానుకలు తీసుకొని ఆమె జీవితంలో నిప్పులు పోసావు. అప్పుడు కట్నం ఇవ్వలేరని అవమానించిన నీ తల్లిదండ్రులు, ఇప్పుడు కట్నం వద్దంటే నీకు ముడి పెడుతు న్న నా తల్లిదండ్రులు మన శ్రేయోభిలాషులా! కాని ప్రతాప్, నేను 'నన్'గా వెళ్ళిపోయేం దుకు నిశ్చయించుకున్నా. నీలకాంత్ జీవితాన్ని చూసి నేను నిర్ణయించుకున్నదీ నేర్చుకున్నదీ ఇదే-ఈ రాగద్వేషాల మధ్యనా జీవితాన్ని నలగనీయను. వాటికన్న విలువైన వెన్నో జీవితంలో ఉన్నాయి- వాటిని అన్వేషిస్తాను"

"నీలకాంత్ ! ఎవడువీడు ? ఉమకూడ ఎప్పుడూ అంటూండేది అంత గొప్పవాడా ?" కోపంతో అన్నాడు.

"గొప్పదనం అధికారంలో, హోదాలో ఉండదు ప్రతాప్ !" అది హృదయానికి సం బంధించింది"

"హూ. హృదయం" వెటకారంగాఅన్నాడు

"నీకది లేకనే ఉమ చనిపోయింది"

ప్రతాప్ ముఖం వెల వెల బోయింది. తలనెమ్మదిగా క్రిందికి దిగింది-

మళ్ళీ సరళ అంది "ప్రతాప్! హృదయం ఎలాంటిది దైతే అలాగే ఎదుటి హృదయాలు కన్పిసవి. నీది క్రూరమైంది- ప్రేమ నర్థం చేసుకునే శక్తిలేదు. ద్వేషాన్ని పోషించే గుండె నీది. అందుకే ఉమ ఆత్మహత్య చేసు కొని నీలకాంత్ సహచర్య కోసం వెళ్ళి పోయింది"

"ఆఁ" ఏమి అర్థం కాక ఢీలా పడి పోయాడు.

"నేను వెళ్ళిపోయే ముందు ఉన్న విషయం చెప్పిపోతాను" అంటూ సూట్ కేస్‌లోంచి ఒక ఉత్తరం తీసి ఇచ్చింది,

సరళా!

నీలకాంత్ ఆత్మహత్య చేసుకున్నాడని నాకూ తెలిసింది. కాని అది నిజంకాదు- నీల కాంత్‌ను నేనే హత్య చేసాను, అవును సరళా నేనే చంపాను...... ప్రతాప్‌పై పగతీర్చు కునే ఉద్దేశంతో కాంత్ మరణానికి కారకు రాల్ని అయ్యాను- అసలు ఆ రోజు నేనక్క డికి వెళ్ళింది అతడికి లొంగిపోవాలనేకాని... సరళా, ఏ ఆడది ఎంతనరకమైనా భర్తను విడిచి వేరొకరితో వుండడానికి సాహసిం చదు. మన సంస్కృతే మనకో సంకెలసరళా! ఆనాటి నుండి ప్రతిక్షణం నరకాన్ని చూస్తు గడుపుతున్న నాకు నీలకాంత్ మరణవార్త స్వాగత పిలుపులా అన్పించింది- నేను చస్తే ప్రతాప్ బాధ పడడు, నేనుకాకపోతే మరొ కరు దొరుకుతారతనికి.

డబ్బు, అంతస్తు, హోదాల వలలోపడి తుచ్ఛమైన ఐహిక సుఖాలకు ప్రాకులాడి వాటి కన్నా విలువైన జీవితాన్ని పొగొట్టుకున్నాను.

ఈ సంచికలో వేసిన గేయపాదాలు కీ. శే. నూతలపాటి
గంగాధరం కవితలనుండి

అది తెల్సుకున్న నాటికి నా ప్రాణాల్ని తీసుకుంటున్నాను!

ఇక్కడ నా ఆత్మీయతకై అలమటించిన నీలకాంత్‌కు దూరంగా ఉన్నాను. కాని నేను అతడి ఆత్మీయత పొందేందుకు అక్కడికే పోతున్నాను, ప్రేమించిన నీలకాంత్‌కు దగ్గరవడం నాకు సంతోషంగా ఉంది. కాని, సరళా! నీలకాంత్‌ను ప్రేమించి పెళ్ళాడిన మాలిని జీవితం అడివిగాచిన వెన్నెలలా ఐపోతుందంటే దానికి కారణం నేనే! అందుకే నన్ను క్షమించమని ఆమెనడుగు. ఆమె క్షమిస్తేనే నా ఆత్మకు శాంతి. నా ఆత్మశాంతికోసం నాకీ సహాయాన్ని చేస్తావు కదూ?

శాశ్వతంగా సెలవు తీసుకుంటూ
నీ
ఉమ

సరళ సూట్‌కేస్ పట్టుకొని ముందుకు నడిచింది, దూరమవుతున్న ఆమెఅడుగుల సవ్వడి విని ఒక్క క్షణం బిత్తరపోయి "సరళా" చిన్నగా కేకేసాడు.

ఆమె ఆగి మెల్లగా వెనక్కి తిరిగింది. అతని చేతిలో ఉత్తరం రెపరెపలాడింది. దగ్గరగా వచ్చి "మాలిని ఎక్కడుంది?" బరువుగా అడిగాడు.

"ఎందుకు?"

ఏదో చెప్పాలని ఏమిచెప్పలేక పోయాడు. మనసులో అస్పష్టంగా గొణుక్కుంటుంటే పెదాలు పిచ్చిగా కదిలాయి. అతడు క్రిందికి చూస్తుండి పోయాడు.

"ఉమ అదృష్టవంతురాలని మాలిని నిండు గుండెతో అంది" అతని ఉద్దేశం గ్రహించి సరళ అంది.

అతను మెల్లగా కనులెత్తి చూసాడు. ఆమె ముందుకు కదిలింది. అతడి కళ్ళలో రెండు కన్నీటిబొట్లునిలిచాయి. నీ చుట్టూవున్న జీవితాలను చదివి భీతిచెందిన నీవు జీవితాంతం "కన్య"గా వుండిపోయేందుకు "నన్"గా చేరాలని వెళ్ళిపోతున్నావు నీకై నా ఆ ప్రశాంతత దక్కనీ... "నేనే దురదృష్టవంతుణ్ని" గొణుక్కున్నాడతడు.


Phone; 470

*For the Best Photographs, Spectacles*

Visit Yours Favourite

**Rangoon Studio & Optical Stores**

PHOTO GOODS DEALER

**MainBazaar : ELURU-1**